క్లుప్తంగా

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్–2 పరీక్షలు



గుడివాడ టౌన్: పట్టణంలో ఆదివారం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్–2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పట్టణంలో మొత్తం 13 పరీక్ష కేంద్రాల్లో ఈ పోటీ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 4,209 మంది అభ్యర్థులకు గాను 3,360 మంది పరీక్షకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. 849 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మ వారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకునేందుకు ఆలయంలో క్యూల్లో భక్తులు ఆదివారం అధికసంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు.

శ్మశానాభివృద్ధికి నూతన కమిటీ ఏర్పాటు చేయాలి



పామర్రు: పామర్రు శ్మశాన వాటిక అభివృద్ధికి నూతన కమిటీ ఏర్పాటు చేయాలని మానవతా రీజియన్ చైర్మన్ పీఎంఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక శివరామ కాంప్లెక్సులోని మానవతా సేవా సంస్థ కార్యాలయం వద్ద సభ్యుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా సంస్థ సభ్యులతో సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. ప్రస్తుతం ఉన్న శాంతిరథం స్థానంలో నూతన రథం ఏర్పాటుకు దాతల సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ ఎస్ త్రివిక్రమరావు, కార్యదర్శి పామర్తి వెంకట నారాయణ, కోశాధికారి పీబీ శ్రీనివాసరావు, కో చైర్మన్ బొమ్మారెడ్డి కోటిరెడ్డి, ప్రతినిధులు ఎస్ రామారావు, మండపాక సుబ్బారావు, పీ విజయలక్ష్మీ పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



గుడివాడ టౌన్: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులకు నూతన వస్త్రాలను ఆదివారం బహూకరించారు. సంస్థ సేవా కార్యక్రమాల్లో భాగంగా వృద్ధ మహిళలకు దుస్తులు పంపిణీ, వైద్యఖర్చుల నిమిత్తం సుమన్ – కమల దంపతులకు రూ.10,116 సాయం అందజేసినట్లు సంస్థ అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ మాజీ గవర్నర్ వై. పూర్ణచంద్ర ప్రసాద్, ఎన్టీఆర్ స్టేడియం శాశ్వత సభ్యులు పర్వతనేని ఆనంద్, మున్సిపల్ మాజీ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, కృష్ణా జిల్లా ప్రెసిడెంట్ పీవీ శేషగిరిరరావు, చైర్మన్ మారుతీ ప్రసాద్, కార్యదర్శి డి. సరస్వతి పాల్గొన్నారు.

సేవా నిలయాలు

సమస్త సేవలకు నిలయమై.. సమస్యల పరిష్కార వేదికై.. సంక్షేమాన్ని అందించే దీపికై.. కష్టాలు తీర్చే కోవెలై.. ప్రజా ప్రయోజన గీతికై.. పేదల బతుకులకు నేస్తమై.. ప్రభుత్వ సేవలను అందిస్తున్న సచివాలయ వ్యవస్థ ప్రజల ప్రశంసలను అందుకుంటోంది. గత పాలనలో ఆదాయ, కుల ధ్రువీకరణ తదితర పత్రాల కోసం మండల కేంద్రాలకు చెప్పులు అరిగేలా తిరగాల్సి వచ్చేది. వందల సేవలను నేడు వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటి గుమ్మాలకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేరువ చేశారు.



మండవల్లి మండలం గన్నవరంలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్ (ఫైల్)

- నియోజకవర్గంలో 79 సచివాలయాలకు అనుమతులు
- రూ.31.6 కోట్ల నిధుల మంజూరు
- 39 సచివాలయాలు పూర్తి
- 505 మంది సిబ్బంది సేవలు

ఇదికదా.. అభివృద్ధి

కైకలూరు: కైకలూరు నియోజకవర్గ నాలుగు మండలాల్లో 79 సచివాలయాల నిర్మాణానికి రూ.31 కోట్ల 60 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రజా సేవలకు ప్రతిరూపంగా గ్రామ సచివాలయాలు పని చేస్తున్నాయి. కైకలూరు నియోజకవర్గం కైకలూరు మండలంలో 22, కలిదిండి మండలంలో 20, మండవల్లి మండలంలో 16, ముదినేపల్లి మండలంలో 21 వెరసి మొత్తం 79 సచివాలయాలను ప్రభుత్వం కేటాయించింది. ఇప్పటికే నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 39 సచివాలయ భవనాలను ప్రారంభించారు. నాలుగు మండలాల్లో సచివాలయంలో విధులు నిర్వహించే సెక్రటరీ, డిజిటల్, వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఫిషరీస్, ఏఎన్ఎం, సర్వేయర్, మహిళా పోలీసు, అగ్రికల్చరల్, వీఆర్వో వంటి 505 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

అధునాతన సౌకర్యాలతో భవనాలు

సచివాలయ భవనాలను కార్పొరేటు ఆఫీసులను తలదన్నేవిధంగా ప్రభుత్వం నిర్మిస్తోంది. ఒక్కో భవనానికి దాదాపు రూ.43 లక్షలు ఖర్చు చేస్తోంది. కై కలూరు మండలంలో వేమవరప్పాడు, తామరకొల్లు, కై కలూరు–1, వరహాపట్నం, దొడ్డిపట్ల, భుజబలపట్నం, ఆలపాడు, పల్లెవాడ, కై కలూరు–2, కలిదిండి మండలంలో కోరుకొల్లు –1, పడమటిపాలెం, కోరుకొల్లు – 2, సానారుద్రవం, కలిదిండి –1, భాస్కరరావుపేట, మూలలంక, పెదలంక, మట్టగుంట, తాడినాడ, పోతుమర్రు, కొండంగి, గుర్వాయిపాలెం, మండవల్లి మండలంలో గన్నవరం, భైరవపట్నం, ఉనికిలి, అయ్యవారిరుద్రవరం, మండవల్లి, ముదినేపల్లి మండలంలో గురజ, పేయ్యేరు, వడాలి, బొమ్మినంపాడు, అల్లూరు, కొరగుంటపాలెం, వణుదుర్రు, దేవపూడి, పెదగొన్నూరు, వాడవల్లి, ఊటుకూరు, వైవాక గ్రామాల్లో సచివాలయాలను ప్రారంభించారు. కొన్ని నిర్మాణాలు జరుగుతున్నాయి.



కైకలూరు సచివాలయం



కైకలూరు మండలం ఆలపాడు సచివాలయం



మండవల్లి సచివాలయం



కైకలూరు మండలం భుజబలపట్నం సచివాలయం

సత్వర సేవలు



సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రజలకు సత్వర సేవలు అందుతున్నాయి. గతంలో మత్స్యకార లైసెన్సులు పొందాలంటే మండల కేంద్రాలకు వెళ్లేవారు. ఇప్పుడు సచివాలయంలోనే లైసెన్సులు జారీ చేస్తున్నారు. చేపల, రొయ్యల సాగు రైతులకు క్షేత్రస్థాయిలో యాజమాన్య పద్ధతులు, వ్యాధుల గుర్తింపు వంటివి చేస్తున్నాం.

– పి.రాజేష్, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్, కైకలూరు

సమస్యల పరిష్కార వేదిక



సచివాలయాలు సమస్యల పరిష్కార వేదికగా మారాయి. కుల, ఆదాయ, మరణ ధ్రువపత్రాలు పొందాలంటే మండల కేంద్రాలకు ప్రజలు వచ్చేవాళ్లు. నేడు సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన తర్వాత పత్రాలను వలంటీర్లు ఇంటికి తీసుకొచ్చి అందిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సేవలన్నీ గ్రామంలోనే లభించాలనే ఆలోచన ఎంతో గొప్పది.

– పసుపులేటి లక్ష్మి, మండవల్లి

లక్ష్యాన్ని నెరవేరుస్తున్నాం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాల ద్వారా కోరుకున్న లక్ష్యాన్ని నెరవేరుస్తున్నాం. నా చదువు పూర్తి చేసిన వెంటనే ప్రభుత్వ ఉద్యోగం వస్తోందని కలలో కూడా ఊహించలేదు. సచివాలయ వ్యవస్థలో ఉద్యోగిగా ప్రజలకు సేవ చేస్తున్నందుకు గర్వపడుతున్నాను.

– డి.రాకేష్, వ్యవసాయ సహాయకుడు, పెదపాలపర్రు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండల కేంద్రంతో పాటు చంద్రాలలో సోమవారం ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఏఈ సుబ్బారెడ్డి ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు. విద్యుత్ లైన్లపై కమ్మేసిన చెట్ల కొమ్మలను తొలగించే నిమిత్తం ఏర్పడుతున్న ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కొలువై ఉన్న స్వామిని అధిక సంఖ్యలో భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. స్వామివారి పుట్టలో పాలుపోసి దర్శించుకునేందుకు క్యూలో అధిక సమయం వేచి ఉండాల్సి వచ్చింది. పాల పొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద గోకులంలోని గోవులకు మహిళలు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. సహాయ కమిషనర్ నేల సంధ్య భక్తులు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా పర్యవేక్షించారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న సీఐ కృష్ణకుమార్

మండవల్లి: రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండవల్లి ఎస్సై సీహెచ్ రామచంద్రరావు సమస్యాత్మక గ్రామమైన పెనుమాకలంకలో ఆదివారం గ్రామసభ నిర్వహించారు. సభలో సీఐ కృష్ణ కుమార్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా, పక్షపాతం లేకుండా వినియోగించుకోవడానికి పోలీసులు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు భరోసా ఇచ్చారు. గ్రామాల్లో ఎలాంటి వైషమ్యాలు లేకుండా నచ్చిన రాజకీయ పార్టీకి ఓటు వేసుకునేలా ఒకరికొకరు సహకరించుకోవాలని కోరారు. ఓటును వినియోగించుకునే విషయంలో ఎవరైనా ఆటంకాలు సృష్టిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెడ్డిపాలెం, ఇందిరమ్మ కాలనీల్లో రోడ్లకు మహర్దశ

రూ.45 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం

పమిడిముక్కల: మంటాడ శివారు రెడ్డిపాలెం, ఇందిరమ్మ కాలనీల్లోని రోడ్లకు మహర్దశ పట్టింది. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించారు. రెడిపాలెం, ఇందిరమ్మ కాలనీలు లోతట్టు ప్రాంతంలో ఉన్నాయి. డ్రెయినేజీ సౌకర్యం లేదు. వర్షం పడితే ఇళ్లలోకి నీరు చేరుతుంది. రోజులు తరబడి నీరు నిలిచి ఉండటంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కాలనీ వాసుల సమస్యలు గుర్తించి రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గడప గడపకు నిధులు రూ.20 లక్షలు, ఎంపీ నిధులు రూ.10 లక్షలు, రాజ్యసభ సభ్యుల నిధులు రూ.15 లక్షలు మంజూరు చేయించారు. మొత్తం రూ.45 లక్షలతో రెండు కాలనీల్లో తొమ్మిది సీసీ రోడ్లను నిర్మించారు. అదేవిధంగా రాజ్యసభ సభ్యులు పరిమళనత్వానీ నిధులు రూ.25 లక్షలతో ఐదు సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు పీఆర్ ఏఈ శరాబందిరాజు తెలిపారు. రహదారుల అభివృద్ధికి కృషిచేసిన ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్‌కు ఎంపీటీసీ సభ్యురాలు మేరుగ లక్ష్మి, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, రెడ్డిపాలెం, ఇందిరమ్మ కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.



రెడ్డిపాలెంలో నిర్మించిన సీసీ రోడ్డు



ఇందిరమ్మ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు

ముస్తాబవుతున్న పీఏసీఎస్ నూతన భవనం


తోట్లవల్లూరు: తోట్లవల్లూరు పీఏసీఎస్(నార్త్) నూతన భవన సముదాయం ప్రారంభానికి ముస్తాబవుతోంది. గతంలో ఉన్న పీఏసీఎస్ భవనం శిథిలావస్థకు చేరటంతో, దానిని తొలగించి నూతన భవన నిర్మాణానికి సొసైటీ పాలకవర్గం శ్రీకారం చుట్టింది. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సహకారంతో కేడీసీసీ బ్యాంకు నిధులు రూ.38.25 లక్షలు, సొసైటీ బిల్డింగ్ ఫండ్ నిధులు రూ.18 లక్షలతో పీఏసీఎస్ కార్యాలయం, గోడౌన్‌కు కలిపి సువిశాల భవనాన్ని నిర్మించారు. భవన నిర్మాణ పనులు పూర్తి కావడంతో రంగులు వేసే పనులు కొనసాగుతున్నాయి. కొత్త భవన నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయని, మార్చి మొదటి వారంలో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి చేతుల మీదుగా ప్రారంభించటానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు పీఏసీఎస్ అధ్యక్షుడు పడమట హరిప్రసాద్ తెలియజేశారు.



తోట్లవల్లూరులో ప్రారంభానికి సిద్ధమైన పీఏసీఎస్ భవనం

నేటి నుంచి రాములోరి ప్రతిష్ఠా మహోత్సవాలు

ప్రారంభానికి సిద్ధమైన 170 ఏళ్ల ప్రాచీన ఆలయం



శ్రీ సీతాసమేత హరి కోదండరామాలయం

మచిలీపట్నంటౌన్: రాజుపేట పెద్దవీధిలో 170 ఏళ్ల ప్రాచీన శ్రీ సీతాసమేత హరి కోదండ రామాలయం జీర్ణోద్ధరణ పనులు పూర్తయ్యాయి. పూరిపాకలో, చిన్నపాటి షెడ్డులో నిర్వహించిన ఈ ఆలయం దాతల సహకారంతో నిర్మించారు. టీటీడీ శ్రీ శ్రీవాణి పథకం ద్వారా రూ. 10 లక్షల విరాళం, భక్తుల విరాళాలు సమర్పించారు. ఆలయ పునః ప్రతిష్ఠ మహోత్సవం, ఆలయంలో సీతారామలక్ష్మణ ఆంజనేయ, గణపతి, సరస్వతి పాలరాతి, పంచలోహ విగ్రహాల ప్రతిష్టా మహోత్సవం ఈ నెల 26వ తేదీ సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 27వ తేదీన పలు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 28వ తేదీ బుధవారం స్వామివార్ల విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం ఉదయం 9.53 గంటలకు నిర్వహించనున్నారు. అదేరోజు సీతారామ కల్యాణంతో పాటు మధ్యాహ్నం అన్నసమారాధన జరగనుంది.

పక్షుల కేంద్రంలో పర్యాటకుల సందడి



ఆటపాక పక్షుల కేంద్రంలో పర్యాటకుల బోటు షికారు



పక్షుల కేంద్రం పిల్లల పార్కు వద్ద సందడి

కై కలూరు: పక్షి ప్రేమికుల స్వర్గధామంగా పేరు గడించిన ఆటపాక పక్షుల కేంద్రంలో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున యాత్రికులు విచ్చేశారు. బోటు షికారు చేస్తూ సమీపం నుంచి పెలికాన్, పెయింటెడ్‌స్టార్క్ పక్షుల కేరింతలను ఆస్వాదించారు. అనంతరం పక్షి నమూనా మ్యూజియాన్ని సందర్శించారు. చిన్నారులు పార్కులో ఆటలాడుకున్నారు. అటవీశాఖ సిబ్బంది కొల్లేరు పక్షుల విశేషాలు, కొల్లేరు భౌగోళిక పరిస్థితులను పర్యాటకులకు వివరించారు.

పోతురాజు జాతర మహోత్సవం

నాగాయలంక: గ్రామంలో బోసుబొమ్మ సర్కిల్‌లోని శ్రీపోతురాజుస్వామి వార్షిక జాతర మహోత్సవం, గుడి సంబరం ఆదివారం కోలాహలంగా జరిగింది. పోతురాజుకు మొక్కుబడులు చెల్లించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పల్నాటి ఆచారవంతుల పర్యవేక్షణలో జాతర సాంప్రదాయాలకు అనుగుణంగా రజక పూజారులు ప్రత్యేకపూజలు జరిపి, చద్దినైవేద్యాలు స్వీకరించారు. తొలుత అనవాయితీ ప్రకారం గ్రామంలోని పల్లయ్యగారి ముఠా జాతరకు శ్రీకారం చుట్టారు. డప్పు నృత్యాలు, మేళతాళాలతో, నైవేద్యాల కావళ్లతో భక్తులు బంధుమిత్రులతో కలసి భారీగా తరలి వచ్చారు. శనివారం రాత్రి ఘటాల గ్రామోత్సవం ముగించుకుని ఆదివారం తెల్లవారుజామున గుడికి చేరుకోవడంతో సంబరం ఆరంభించారు. గడ్డిపాటి ఉమా వెంకటేశ్వరరావు(హైదరాబాద్ చిన్న) ఆర్థిక సౌజన్యంతో ఆలయ ప్రాంగణంలో 50మంది వృద్ధులకు చీరలు, పంచెలు అందజేశారు. అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే అంబటి శ్రీహరి ప్రసాద్, ఆలయ పునర్నిర్మాణ దాత కంఠంనేని ప్రేమ్‌చంద్ ఏఎంసీ మాజీచైర్మన్ మండవ బాలవర్ధిరావు, ఉపసర్పంచి తలశిల వెంకట నరసింహారావు(నాని), శ్రీరామపాదక్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు తదితర ప్రముఖులు పోతురాజుస్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఎనిమిది వేలమంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు. నిర్వాహక కమిటీ ప్రతినిధులు ఉప్పల లీలాకృష్ణ ప్రసాద్(బుజ్జి), గడ్డిపాటి ప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

కరేటి మృతి తీరని లోటు

ముదినేపల్లి రూరల్: మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కరేటి గోవిందరాజులు మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోటని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండలంలోని బొమ్మినంపాడులో గోవిందరాజులు స్వగృహం వద్ద సంస్మరణ సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి మండలంలో పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడిగా ఎంతో సమర్థవంతంగా తన బాధ్యతలను నిర్వర్తించి రైతులకు మేలు చేశారన్నారు. గోవిందరాజులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీ చొప్పర్ల సునీత, నాయకులు నిమ్మగడ్డ భిక్షాలు, పాతూరి సీతారామాంజనేయులు, ఈడే వెంకటేశ్వరరావు, నువ్వుల కోటేశ్వరరావు, మరీదు నాగయ్య, దివి సతీష్, రాచూరి కుమార్ పాల్గొన్నారు.

డ్రెయిన్‌కు ప్రత్యామ్నాయం చూపాలి

ముదినేపల్లి రూరల్: రహదారి విస్తరణ పేరుతో పూడ్చివేస్తున్న డ్రెయిన్‌కు ప్రత్యామ్నాయం చూపాలని మండలంలోని పెదపాలపర్రు రైతులు డిమాండ్ చేశారు. జాతీయ రహదారి 165 విస్తరణలో భాగంగా పెదపాలపర్రు శివారు ప్రైవేటు పరిశ్రమ సమీపంలో రహదారికి ఇరువైపులా ఉన్న డ్రెయిన్‌లను పూడ్చివేస్తూ విస్తరణ పనులు చేపడుతున్నట్లు రైతులు తెలిపారు. దీనివల్ల సుమారు 500 ఎకరాల్లోని మురుగునీరు పారుదలకు ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు. ఈ సమస్యను డ్రెయినేజీ అధికారులకు తెలియజేయగా నేషనల్ హైవే అధికారులకు సమస్యను తెలియజేసినప్పటికీ దీనిపై ఇప్పటివరకు స్పందించలేదని అధికారులు తెలిపారన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి తమకు ప్రత్యామ్నాయం చూపాలని లేకుంటే రహదారి విస్తరణ పనులు అడ్డుకుంటామని హెచ్చరించారు.

పెద్దింట్లమ్మా.. చల్లంగ చూడమ్మా

కై కలూరు: అమ్మా.. పెద్దింట్లమ్మా.. మా కుటుంబాలను చల్లంగ చూడమ్మా.. అంటూ భక్తులు కొల్లేటికోట పెద్దింట్లమ్మను వేడుకున్నారు. అమ్మవారి దేవస్థానం వద్ద ఆదివారం కావడంతో సమీప జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మను దర్శించుకున్నారు. ఆదాయపన్ను(టీడీఎస్) కమిషనర్ ఎస్.నరేష్(ఐఆర్ఎస్) దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈఓ కందుల వేణుగోపాలరావు ఆలయ మర్యాదలతో దంపతులను సత్కరించారు. మార్చి 11 నుంచి 24వ తేదీ వరకు పెద్దింట్లమ్మ జాతర(తీర్థం) నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

కొల్లేటికోటలో మార్చి 11 నుంచి అమ్మవారి జాతర



అమ్మ దర్శనానికి వచ్చిన ఆదాయ పన్ను కమిషనర్ దంపతులను సన్మానిస్తున్న ఈఓ

ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గుడ్లవల్లేరు: అంగలూరులోని ప్రభుత్వ జిల్లా ఉపాధ్యాయ శిక్షణా సంస్థ(డైట్)లో ఆదివారం పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. 1984–85వ బ్యాచ్‌కు సంబంధించిన పూర్వ విద్యార్థులు తమకు విద్యను అందించిన అధ్యాపకులను సన్మానించారు. 38ఏళ్ల తర్వాత ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనారాయణ, అధ్యాపకులు వై.వరకుమార్, కె.రామచంద్రరావు. పి.వినయ్‌కుమార్, మోహినీకుమారి, రాజ్యలక్ష్మి, ఆర్గనైజింగ్ కమిటీ ఎ.సుబ్రహ్మణ్యం, టి.శ్రీనివాసరరావు, వి.బాలాజీ, ఇ.వెంకటేశ్వరరావు, జి.విజయ్ కుమార్, కె.రామకృష్ణారావు, ఎ.వరలక్ష్మి, కె.అన్నపూర్ణ పాల్గొన్నారు.